తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 03- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 29 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

## స్థల సేకరణ తుది దశలో.. లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధం

## గోషామహల్‌లో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి అవసరమైన భూసేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తవుతుందని వెల్లడించారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గోషా మహల్ నియోజకవర్గంలో నిర్మించిన



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మిగతా 2లో



# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

## ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజనం

### పథకం నాణ్యత, పర్యవేక్షణ మెరుగుదలే లక్ష్యం

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు పథకం అమలులో జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. త్వరలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ కానున్నాయి.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పీఎం-పోషణ్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు పాఠశాల హాజరును కూడా పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. కొత్త నిర్ణయం ప్రకారం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా అదే భోజనాన్ని స్వీకరించనున్నారు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, రుచి, పోషక విలువలపై

మిగతా 2లో

# రాష్ట్ర అప్పులపై లెక్కలు బయటపెట్టిన జూపల్లి

- **బీఆర్ఎస్ ఆరోపణలకు ఆధారాలతో సమాధానం**
- **లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్**

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఆధారాలతో సమాధానం ఇచ్చానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. తాను వెల్లడించిన



లెక్కలు తప్పని నిరూపించాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు.

మిగతా 2లో

# జూపల్లి కోసం ఎదురుచూశాం.. రాలేదు: కేటీఆర్



- **గన్‌పార్క్ వద్ద చర్చకూ సిద్ధమని ప్రకటన**
- **పోలీసుల తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శలు**

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర అప్పుల అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ మంత్రులు వెనక్కి తగ్గారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్‌లో ప్రత్యేకంగా

మిగతా 2లో

# భూ పోరాటంలో కవిత అరెస్ట్

- **పోలీసుల తీరుపై టీఆర్ఎస్ ఆగ్రహం**
- **బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. పలువురు నాయకులు, కార్యకర్తల అదుపులోకి**
- **ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలని డిమాండ్**



**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో చేపట్టిన భూ పోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కవితతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో

మిగతా 2లో






శుక్రవారం - 03- జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఒక్కో నియోజకవర్గంలో 500 నుంచి వెయ్యి ఇళ్ల వరకు నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో దశల్లో మరిన్ని ఇళ్లను మంజూరు చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటిని అందజేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5,500 వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేసిన మంత్రి, పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా ఉన్నప్పటికీ అదే ప్రాంతాల్లో పేదలకు ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు అందిస్తామని స్పష్టం చేశారు. పేదలను నగరాలకు దూరంగా తరలించి ఇళ్లు నిర్మించే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించదని, వారి జీవనాధారాలకు సమీపంలోనే గృహాలు కల్పిస్తామని పేర్కొన్నారు.




ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మిగిలిన అర్హులైన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు సమీప ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి అర్హ కుటుంబానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. పేదల గృహ నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత పాలనలో భారీ ప్రాజెక్టుల పేరుతో నిధులు ఖర్చు చేశారని విమర్శించిన ఆయన, తమ ప్రభుత్వం మాత్రం పేదల గూడు కోసం నిధులను వినియోగిస్తోందన్నారు. గుడిసెల్లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయగలరని అధికారులు భావిస్తున్నారు. భోజనంలో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. వంటశాలల నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయడం వల్ల విద్యార్థులకు మెరుగైన ఆహారం అందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ఉపాధ్యాయులు కూడా పథకంలో భాగస్వాములు కావడంతో విద్యార్థుల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పాఠశాలల్లో పోషకాహార ప్రమాణాలను పెంపొందించేందుకు ఇది ఒక కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన పోషకాహారం అందించడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు పథకం అమలులో జవాబుదారీతనం, పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



# జూపల్లి కోసం ఎదురుచూశాం.. రాలేదు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కుర్చీ వేసి ఎదురుచూశామని, శాలువాతో సన్మానించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆయన రాలేదని విమర్శించారు. ప్రభుత్వం చర్చకు ముందుకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. గన్‌పార్క్ వద్ద చర్చకు రావడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజల ముందే వాస్తవాలు చర్చించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. బహిరంగ వేదికపై చర్చ జరిగితే నిజాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు.

తాము గన్‌పార్క్‌కు వెళ్లేందుకు బయలుదేరిన సమయంలో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశాన్ని ప్రభుత్వం హరించిందన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో తాము ఎదురుచూస్తే కాంగ్రెస్ నాయకులు మాత్రం రాలేదని కేటీఆర్ అన్నారు. చర్చకు సిద్ధమని ప్రకటించిన తర్వాత వెనక్కి తగ్గడం సరైన విధానం కాదన్నారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందని వ్యాఖ్యానించారు.




కాంగ్రెస్ మంత్రులు సమావేశాల్లో కూర్చొని వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రయోజనం లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలంటే బహిరంగ చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక అంశాలపై పారదర్శక చర్చ జరగాలని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, వాదోపవాదాలు సహజమని, ప్రభుత్వం వాటికి దూరంగా ఉండకూడదన్నారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

# రాష్ట్ర అప్పులపై లెక్కలు బయటపెట్టిన జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఏర్పాటు సమయంలో 2014 జూన్ 2 నాటికి తెలంగాణపై మొత్తం బకాయిలు రూ.90,161 కోట్లు మాత్రమే ఉన్నాయని జూపల్లి తెలిపారు. అయితే 2023 డిసెంబర్ 1 నాటికి రాష్ట్ర అప్పులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఎఫ్ఆర్‌బీఎం కింద తీసుకున్న రుణాలు రూ.72,658 కోట్ల నుంచి రూ.3,89,673 కోట్లకు చేరాయని చెప్పారు. అలాగే ప్రభుత్వ హామీతో ప్రత్యేక ప్రయోజన సంస్థలు తీసుకున్న, ప్రభుత్వం చెల్లించాల్సిన రుణాలు రూ.11,609 కోట్ల నుంచి రూ.1,27,208 కోట్లకు పెరిగాయని వెల్లడించారు.

ఈ రెండు కలిపి ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యతలో ఉన్న అప్పులు రూ.84,268 కోట్ల నుంచి రూ.5,16,881 కోట్లకు చేరాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ హామీతో ప్రత్యేక ప్రయోజన సంస్థలు తీసుకుని, ఆయా సంస్థలే చెల్లించాల్సిన రుణాలు రూ.5,893 కోట్ల నుంచి రూ.95,462 కోట్లకు పెరిగాయని తెలిపారు. అదనంగా ప్రభుత్వేతర హామీలతో కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు రూ.59,414 కోట్లుగా ఉన్నాయని వివరించారు. ఈ లెక్కలన్నింటిని కలిపితే రాష్ట్ర మొత్తం అప్పులు రూ.6,71,757 కోట్లకు చేరాయని జూపల్లి తెలిపారు.



అప్పులతో పాటు పెండింగ్ బిల్లుల భారం కూడా భారీగానే ఉందన్నారు. ఉద్యోగుల బకాయిలు, మూలధన పనులు, సంక్షేమ పథకాల చెల్లింపులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.40,154 కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు, సింగరేణి విద్యుత్ బకాయిలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు తదితర చెల్లింపులు కలిపి మరో రూ.1,09,740 కోట్ల భారం ఉందని వెల్లడించారు.

అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి రాష్ట్రంపై మొత్తం రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ లెక్కలు తప్పని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తే వాటిని ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. తన లెక్కలు తప్పని తేలితే మంత్రి పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఈ లెక్కలు తప్పని కేటీఆర్ చెప్పించాలని జూపల్లి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని, అందుకే అధికారిక గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను వెల్లడించానని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# భూ పోరాటంలో కవిత అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల తీరును నిరసిస్తూ టీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూ పోరాటం సందర్భంగా హెచ్ఎండీఏ భూముల్లో 'ఉద్యమకారుల రక్షణ కాలనీ' పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, బొడ్రాయి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. భూముల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

అరెస్టు సమయంలో పోలీసులు తనతో దురుసుగా ప్రవర్తించారని కవిత ఆరోపించారు. తనను బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కించే క్రమంలో గాయాలయ్యాయని తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, పలువురికి గాయాలయ్యాయని పార్టీ నాయకులు ఆరోపించారు. అనంతరం కవితను బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్ద టీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. కవితను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అరెస్టులు, నిర్బంధాలు చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

భూ పోరాటాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు నిర్బంధాలు చేపట్టారని టీఆర్ఎస్ ఆరోపించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నప్పటికీ వేలాది మంది ఉద్యమకారులు బోడుప్పల్‌కు చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. హామీలు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ ఘటనతో బోడుప్పల్ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.





# చర్చకు పిలిచి అడ్డుకోవడం ఎందుకు?: హరీశ్‌రావు

- గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శ

హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, చర్చకు పిలిచి మరోవైపు గన్‌పార్క్‌కు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు గన్‌పార్క్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దించి అడ్డుకుందని విమర్శించారు. ప్రభుత్వానికి నిజాలను ఎదుర్కొనే ధైర్యం లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. గన్‌పార్క్ వద్ద రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు తెలిపారు. ఒకవైపు చర్చకు రమ్మని పిలిచి, మరోవైపు చర్చ జరిగే అవకాశాన్ని అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు.



బీఆర్ఎస్ నాయకులు చర్చకు వస్తే ప్రభుత్వ అవినీతి, స్కాములు ప్రజల ముందుకు వస్తాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నారని విమర్శించారు. చర్చకు సిద్ధమని చెప్పిన ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉండాల్సిందని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కూడా నిరాకరించడం సరికాదన్నారు. ప్రభుత్వం విమర్శలను స్వీకరించి ప్రజల ముందు సమాధానం చెప్పాలని సూచించారు.

రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం బహిరంగ చర్చలు అవసరమని, అందుకు ప్రభుత్వం సహకరించాల్సిన బాధ్యత ఉందని హరీశ్‌రావు అన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాలను అణచివేయాలనే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందు నిజాలు చెప్పేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# వీణవంక రోడ్డులో కొత్త డ్రైన్.. 24వ వార్డు వరద ముప్పు నివారణకు చర్యలు



**జమ్మికుంట టౌన్ జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలోని వీణవంక రోడ్డులో ఉన్న ప్రధాన డ్రైన్‌ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గురువారం పరిశీలించారు. వర్షాకాలంలో భారీగా వచ్చే వరద నీరు 24వ వార్డులోకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పరిస్థితిని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, వరద నీరు పక్క వార్డుల్లోకి వెళ్లకుండా నేరుగా నాయిని చెరువు మత్తడి వరకు వెళ్లేలా వీణవంక రోడ్డులో కొత్త డ్రైన్ నిర్మాణం అత్యవసరమని తెలిపారు. ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కోసం త్వరలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పనులు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.
ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, టీపీఎస్ రాజ్‌కుమార్, ఏఈ వికాస్, ఆర్అండ్‌బీ ఏఈతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రజా ప్రతిభ విలేఖరి సాగర్‌కు సన్మానం



**హుజూరాబాద్,జులై 02(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా ప్రతిభ దినపత్రికలో జిల్లా చీఫ్ బ్యూరో ఇన్‌చార్జిగా పదోన్నతి పొందిన విలేఖరి ఇప్పకాయల సాగర్‌కు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు.
తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇప్పకాయల సాగర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా సంగెం సత్యనారాయణ మాట్లాడుతూ, హుజూరాబాద్ ప్రాంతంలో గత దశాబ్ద కాలంగా ప్రజా ప్రతిభ రిపోర్టర్‌గా కొనసాగుతూ ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా నిలిచి, నిష్పాక్షిక విలువలతో కూడిన జర్నలిజానికి అంకితభావంతో సేవలందిస్తున్న ఇప్పకాయల సాగర్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సామాన్య ప్రజలకు అండగా నిలవాలని, పద్మశాలి సమాజానికి కూడా తన వంతు సహకారం అందించాలని కోరారు.
ఇప్పకాయల సాగర్ జిల్లా చీఫ్ బ్యూరో ఇన్‌చార్జిగా పదోన్నతి పొందడం హుజూరాబాద్ ప్రాంతానికే గర్వకారణమని పలువురు నాయకులు అభినందించారు.
ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు సబ్బని రాజేందర్, మార్కెట్ డైరెక్టర్ బండారి సదానందం, మంద బిక్షపతి, సంగెం శ్రీనివాస్ (చిక్స్), కుడికాల ప్రభాకర్, సంగెం శ్రీనివాస్ (మెడికల్), బూర్ల చంద్రమౌళి, వడ్నాల ప్రభాకర్ (జె.కె.), పత్తిపాక ఋషి తదితరులు, అధిక సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.
అవసరమైతే దీనికి మరింత ఆకర్షణీయమైన "బిగ్ న్యూస్" హెడ్డింగ్ కూడా సూచించగలను.

# జంగమాయపల్లిలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



**పెద్దమందడి,జులై(02తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జంగమాయపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మరో ముందడుగు పడింది.గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొట్టుకూరి శ్రీనివాస్ రెడ్డి తన స్వంత నివాస భవనంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడంతో పాటు గ్రామ ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయం గ్రామ ప్రజలకు, కార్యకర్తలకు సేవా కేంద్రంగా నిలుస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాతో శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.2 కోట్ల బ్లాక్‌మనీ పేరుతో వల.. డెకాయిటీ ముఠా గుట్టురట్టు..





- **12 మంది అరెస్ట్.. ఇద్దరు పరారీలో.**
- **రూ.17.60 లక్షల నగదు, వాహనాలు, పోలీస్ యూనిఫాంలు స్వాధీనం.**

**సత్తుపల్లి, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):** రూ.2 కోట్ల బ్లాక్‌మనీని వైట్‌మనీగా మారుస్తామని నమ్మించి అమాయకులను వలలో వేసి, అనంతరం నకిలీ పోలీసుల వేషంలో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర డెకాయిటీ ముఠాను సత్తుపల్లి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో 12 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో సి.ఆర్.నెం.281/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 310(2), 318(4), 319(2), 204, 61(2), 109 ప్రకారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టి.శ్రీహరి దర్యాప్తు చేపట్టగా, కల్లూరు ఏసీపీ శ్రీమతి వసుంధరా యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు బుధవారం ఉదయం గంగారం ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో ఎ-1 ఈద చంటి బాబు (31), తండ్రి భోగేశ్వరరావు, పెయింటర్, వెంకటాపురం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా; ఎ-2 ముళ్లగిరి వర్ధన్ (27), తండ్రి శ్రీనివాసరావు, టీజీఎస్పీ కానిస్టేబుల్, తుంబూరు గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా; ఎ-3 మువ్వా సత్యనారాయణ (32), తండ్రి జయరాజు, ప్రైవేట్ ఉద్యోగి, టి. నర్సాపురం గ్రామం, ఏలూరు జిల్లా; ఎ-4 బేరా కేశవరావు (51), తండ్రి అబ్బస్వామి (మరణించారు), ఆర్ఎస్ఐ, టీజీఎస్పీ 15వ బెటాలియన్, బేతుపల్లి గంగారం గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా; ఎ-5 మారుముడి మధు (38), తండ్రి బాలసుందర్, క్యాబ్ డ్రైవర్, మల్లాయిగూడెం గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా; ఎ-6 గోరంట్ల గౌతమ్ కుమార్ (26), తండ్రి కృష్ణారావు, బీరపల్లి గ్రామం, వేంసూరు మండలం, ఖమ్మం జిల్లా; ఎ-7 కర్లపూడి నవీన్ (26), తండ్రి మాధవరావు, ఆటో డ్రైవర్, సదాశివపురం గ్రామం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా; ఎ-8 నక్కా నాగరాజు (26), తండ్రి రాంబాబు, మెకానిక్, తుంబూరు గ్రామం, సత్తుపల్లి మండలం, ఖమ్మం జిల్లా; ఎ-9 సాగి సుబ్బరాజు (45), తండ్రి సత్యనారాయణ, ప్రైవేట్ ఉద్యోగి, కొడగట్టుపల్లి, రావులపల్లి, అంబేద్కర్ కోనసీమ జిల్లా; ఎ-10 కాపా శ్రీనివాస్ (51), తండ్రి నర్సింహారావు, సెక్యూరిటీ గార్డ్, ఎ.ఎస్.రావు నగర్, సికింద్రాబాద్; ఎ-11 దుడుగూరు కురబ గణేష్ (43), తండ్రి తిప్పయ్యస్వామి, ప్రైవేట్ ఉద్యోగి, శ్రీకృష్ణ నగర్, కర్నూలు జిల్లా; ఎ-12 ఉపేంద్రం జనార్ధనరాజు (39), తండ్రి వరదరాజు, ప్రైవేట్ ఉద్యోగి, రాజేంద్రనగర్, ధర్మవరం, సత్యసాయి జిల్లా. పరారీలో ఎ-13 రామాంజనేయులు, ఎ-14 రాజు (సిమ్ ప్రొవైడర్) ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు అక్రమంగా సిమ్ కార్డులు సేకరించి యాదృచ్ఛికంగా ఫోన్ కాల్స్ చేసి, ఒక్కోసారి మహేందర్‌రెడ్డి, బాలగంగాధర్, చంద్రం, చంటి బాబు పేర్లతో పరిచయం చేసుకుంటూ తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని చెప్పేవారని వెల్లడైంది. తమ వద్ద రూ.2 కోట్ల బ్లాక్‌మనీ ఉందని, దానిని వైట్‌మనీగా మార్చేందుకు రూ.10 లక్షలు ఇస్తే రూ.40 లక్షలు జమ చేస్తామని నమ్మించి బాధితులను రప్పించేవారు. అక్కడ డమ్మీ కరెన్సీతో మభ్యపెట్టి, ముందుగానే సిద్ధంగా ఉన్న నకిలీ పోలీసులు దాడి చేసి, దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి నగదు దోచుకునేవారు. అనుమానం రాకుండా తమ వ్యక్తినే కొట్టినట్లు నటిస్తూ మొత్తం వ్యవహారాన్ని నిజమైన పోలీసుల చర్యగా చిత్రీకరించి డెకాయిటీలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో గంగారం టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్ (ఎ-2), ఆర్ఎస్ఐ బేరా కేశవరావు (ఎ-4) కూడా నిందితులుగా ఉండటం సంచలనంగా మారింది. నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, రెండు ఇన్నోవా కార్లు, ఒక ఎర్టిగా కారు, ఒక టీవీఎస్ యాక్సెస్ స్కూటీ, 16 సెల్‌ఫోన్లు, రెండు పోలీస్ యూనిఫాంలు, ఒక ఎస్ఐ యూనిఫాం, ఒక ఆర్ఎస్ఐ యూనిఫాం, చేతి సంకెళ్లు, 'పోలీస్' అని ముద్రించిన రెండు టీషర్టులు, రెండు రెయిన్‌కోట్లు, ఒక్కో కట్టలో 100 నోట్లు చొప్పున 80 కట్టల డమ్మీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# బుగ్గపల్లి తండా పాఠశాలలో ఉపాధ్యాయుడి నిద్రమత్తు.. మెమో జారీ

**పెద్దమందడి,జూలై02(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నప్పటికీ, కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి ప్రభుత్వ లక్ష్యాలకు విఘాతం కలిగిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గిరిజన తండాల్లోని పాఠశాలల్లో బోధన, సమయపాలన, పర్యవేక్షణపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బుగ్గపల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు జె. బాలరాజు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడంతో గురువారం మీడియా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఉదయం సుమారు 11:40 గంటల సమయంలో తరగతి గదిలో విద్యార్థులు ఉన్నప్పుడే ఉపాధ్యాయుడు నిద్రమత్తులో కనిపించినట్లు వెల్లడైంది. కొంతసేపు వీడియో చిత్రీకరణ జరిగినప్పటికీ ఆయన మేల్కొనకపోవడంతో తల్లిదండ్రులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.
తరచూ పాఠశాలకు ఆలస్యంగా రావడం, విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధన చేయడం లేదనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
అయితే ఈ ఘటనపై ఉపాధ్యాయుడు జె. బాలరాజు స్పందిస్తూ.. ఇటీవల తన తండ్రి మరణించడంతో నిర్వహించిన దినవారాల కార్యక్రమాల వల్ల శారీరకంగా అలసటకు గురయ్యానని, అదే కారణంగా కాసేపు నిద్రమత్తులోకి వెళ్లానని వివరణ ఇచ్చారు.
ఈ ఘటనపై మండల విద్యాధికారి మంజులత స్పందిస్తూ, బుగ్గపల్లి తండా పాఠశాలలో ఉపాధ్యాయుడు విధుల సమయంలో నిద్రమత్తులో ఉన్నట్లు వీడియో ద్వారా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సంబంధిత ఉపాధ్యాయుడు బాలరాజుకు మెమో జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు.ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# భువనగిరి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయండి

- **విజయుడు యాదవ్ టీఆర్‌పీ జిల్లా అధ్యక్షులు**

**వనపర్తి,జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** జులై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని టీఆర్‌పీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు విజయుడు యాదవ్ ఆధ్వర్యంలో, జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ నేతృత్వంలో రాజ్యాధికార సమరభేరి మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విజయుడు యాదవ్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా నుంచి కనీసం రెండు వేల మంది బీసీ ప్రజలు భువనగిరి సభకు హాజరయ్యేలా ప్రతి మండలం, గ్రామం, బస్తీలో విస్తృత ప్రచారం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.




తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో కీలక ఘట్టంగా నిలుస్తుందని, బహుజన వర్గాల రాజకీయ సాధికారతకు ఈ సభ నాంది పలుకుతుందని అన్నారు.బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువత, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో జులై 5న భువనగిరికి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి స్వామి, జిల్లా నాయకులు కురుమూర్తి ముదిరాజు, వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, కొత్తకోట మండల అధ్యక్షుడు మన్నెంకొండ, తాడిపత్రి గ్రామ అధ్యక్షుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి



- ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి.. పంటల బీమా అమలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు

**ఎల్కతుర్తి జులై 02( తెలంగాణ ముచ్చట్లు):** రైతు వ్యతిరేక విధానాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు డిమాండ్ చేశారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి రైతులకు తక్షణ ఉపశమనం కల్పించాలని కోరారు.
పెరిగిన ధరలతో రైతాంగంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయడంతో పాటు యూరియా యాప్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ప్రకటించాలని, మండల పరిధిలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై వ్యవసాయ శాఖ అధికారులు పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టేముక్కుల మనోహర్‌రావు, మండల రైతు సంఘం ఉపాధ్యక్షులు ఇంజాల పోచయ్య, పిన్‌రెడ్డి మోహన్‌రెడ్డి, బోయినపల్లి స్వామిరావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి



- పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,జులై 02 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత పెద్దమ్మ తల్లి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో కలిసి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఐక్యత, సోదరభావం గ్రామంలో నిరంతరం కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష-మద్దిలేటి, గ్రామ పెద్దలు ఎల్లస్వామి, కూర్మన్న, యెంకన్న, బాబు, వెంకట్రామిరెడ్డి, రాములు, నాగమణి, గోపాల్, నర్సమ్మ, కుమ్మరి నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



- లబ్ధిదారుల కుటుంబాలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి భరోసా

**హుజూరాబాద్,జులై 02(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రతిష్ఠాత్మక కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను హుజూరాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాడి కౌశిక్ రెడ్డి మరియు హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని, కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో నరేందర్, ఎంపీడీవో సునీత, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులపై అదనపు చార్జీలు వేయడం అన్యాయం

- మార్కెట్ కమిటీ ద్వారా హమాలీ చార్జీలు చెల్లించే విధానం అమలు చేయాలి
- టీఆర్ఆర్ఎస్ ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్



**ఎల్కతుర్తి జులై02, (తెలంగాణ ముచ్చట్లు):** రైతులపై హమాలీ, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీల భారం తొలగించి, ఆ ఖర్చులను వ్యవసాయ మార్కెట్ కమిటీ భరించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ డిమాండ్ చేశారు.
గురువారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ చైర్మన్ బండి జనార్ధన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హింగే భాస్కర్ మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువచ్చే రైతులపై హమాలీ, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీల పేరుతో అదనపు భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరిగి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు గిట్టుబాటు ధరలు కూడా లభించక నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో హమాలీ చార్జీల భారం రైతులపై మోపడం అన్యాయమని పేర్కొన్నారు. రైతులకు ఉపశమనం కల్పించాలంటే మార్కెట్ కమిటీ ద్వారానే హమాలీ చార్జీలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని కోరారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు సానుకూల నిర్ణయం తీసుకుని రైతులపై పడుతున్న అదనపు భారం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు నాగుర్ల రాజీరు, ఎర్రబెల్లి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాలకు మరిన్ని నిధులు కేటాయించాలి

- ప్రతి ఏజెన్సీ నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళ్ల ప్రతిపాదన.
- పోడు పట్టాలు.. ఆశ్రమ పాఠశాలల అప్‌గ్రేడ్‌కు విజ్ఞప్తి.
- గిరిజన ఎమ్మెల్యేల వినతులపై సీఎం సానుకూల స్పందన.



**అశ్వారావుపేట, జులై 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, ప్రతి ఏజెన్సీ నియోజకవర్గానికి అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో గిరిజన ఎమ్మెల్యేల బృందంతో కలిసి సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజహరుద్దీన్ కూడా హాజరై ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పేద గిరిజన కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతి గిరిజన నియోజకవర్గానికి అదనంగా రెండు వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న అర్హులైన గిరిజన రైతులకు పోడు భూములపై యాజమాన్య హక్కుల పట్టాలు వెంటనే మంజూరు చేయాలని, ఇందిర గిరి జల వికాసం పథకం ద్వారా సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా చేరేలా ఐటీడీఏలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా బలోపేతం చేయాలని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గిరిజన ఎమ్మెల్యేల ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్వీకరించి, వాటిని పరిశీలించి దశలవారీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అశ్వారావుపేటతో పాటు రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, అక్కడి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని జారె ఆదినారాయణ స్పష్టం చేశారు.

# అమ్రిన్ విజయం యువతకు స్ఫూర్తిదాయకం

- ఎల్కతుర్తి లో భారీ అభిమాన ర్యాలీ
- ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి తల్లిదండ్రుల విజ్ఞప్తి



**ఎల్కతుర్తి జూన్ 02, (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలానికి చెందిన యువ బాక్సర్ ఎండి అమ్రిన్ జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం ప్రతి యువకుడు, యువతికి ఆదర్శమని కొనియాడారు. అమ్రిన్ విజయాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించిన ఘన స్వాగత ర్యాలీలో గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్రిన్‌పై పూల వర్షం కురిపిస్తూ అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం ఎల్కతుర్తి మండలానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా అమ్రిన్ తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుమార్తెకు ఇంతటి ఘన స్వాగతం పలికి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం, మెరుగైన శిక్షణా సదుపాయాలు కల్పిస్తే అమ్రిన్ మరింత ఉన్నత స్థాయిలో రాణించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, అమ్రిన్ లాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించి అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తే రాష్ట్రానికి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజేతలు లభిస్తారని అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్ పార్టీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడిగా పెసరు రమేష్

**ధర్మసాగర్,జులై02(తెలంగాణ ముచ్చట్లు) :** ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెసరు రమేష్‌ను కాంగ్రెస్ పార్టీ ధర్మసాగర్ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా పెసరు రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.



పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తానన్నారు. మండలంలోని అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ఐక్యంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ అధిష్ఠానం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తానని పెసరు రమేష్ పేర్కొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన భూపోరాటానికి పోలీసుల బ్రేక్.. అంబాల హరీష్ అదుపులోకి




**జమ్మికుంట టౌన్ జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్, ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో తెలంగాణ అమరవీరుల స్మారక నిర్మాణం కోసం 250 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన చేపట్టిన భూపోరాటానికి మద్దతుగా హైదరాబాద్‌కు బయలుదేరిన జమ్మికుంట మండల ఇన్‌చార్జి అంబాల హరీష్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తెలంగాణ రక్షణ సేన నాయకురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఉప్పల్‌లో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు అంబాల హరీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.
తెలంగాణ అమరవీరుల త్యాగాలను చిరస్థాయిగా నిలబెట్టేందుకు నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో 250 గజాల స్థలాన్ని ప్రభుత్వం వెంటనే కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్ సాధన కోసం చేపట్టిన భూపోరాటానికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయడాన్ని తెలంగాణ రక్షణ సేన నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదని, అమరవీరుల గౌరవాన్ని కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# విక్రమ్ అకాల మరణం బాధాకరం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండలానికి చెందిన నాయకులు విక్రమ్ అకాల మరణం అత్యంత బాధాకరమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విచారం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే ఖిల్లా ఘణపురంలోని విక్రమ్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విక్రమ్ ప్రజలతో మమేకమై సేవా భావంతో పనిచేసే మంచి వ్యక్తి అని కొనియాడారు. ఆయన అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు పరిచయస్తులను, అభిమానులను తీవ్ర విషాదంలోకి నెట్టిందన్నారు.భగవంతుడు విక్రమ్ ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఖిల్లా ఘణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావులేదు: బీజేపీ నాయకుడు గంట సంపత్



**హుజూరాబాద్, జూలై 02(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ పట్టణంలోని బోర్నపల్లి ప్రాంతంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని బీజేపీ నాయకుడు గంట సంపత్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ లు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు నమోదు చేస్తున్న తీరును ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.
ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరిని కలవాలని, ఆధార్, ఇతర గుర్తింపు పత్రాల ఆధారంగా ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు చోటుచేసుకోకుండా బి ఎల్ ఓ లు పూర్తి బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ప్రజలు కూడా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని గంట సంపత్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతుందని అన్నారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఒకటో తేదీ జీతాల హామీ అమలు ఎక్కడ?

- ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా.. జీతాలు మాత్రం లేవు
- ఖాజా హుస్సేన్, జిల్లా కోఆర్డినేటర్, ఎన్‌హెచ్ఎం



**వనపర్తి,జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీకే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను చెల్లించాలని స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, జూలై నెల రెండో తేదీ వచ్చినా జీతాలు ఉద్యోగుల ఖాతాల్లో జమ కాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ ఖాజా హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో 79 అది 30 మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఉన్నప్పటికీ వేతనాలు అందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సంబంధిత అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసి, ఉద్యోగులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి నెల వేతనాలపైనే ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాల జాప్యంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అన్ని శాఖల్లో సమర్థవంతంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఇకపై ప్రతి నెల ఒకటో తేదీకే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, జీతాల చెల్లింపుల్లో జాప్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఖాజా హుస్సేన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ గృహప్రవేశానికి హాజరైన ఆదిత్య రెడ్డి



**వనపర్తి,జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ నూతన గృహప్రవేశ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐపీసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు.అనంతరం వినోద్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు.నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నెలకొనాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎం. దేవన్న యాదవ్, నాగార్జున, శివతో పాటు పలువురు స్నేహితులు, ఆత్మీయులు, ప్రముఖులు పాల్గొని వినోద్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇస్రోకు బాంబు బెదిరింపు

**బెంగళూరు, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రధాన కార్యాలయానికి గురువారం బాంబు బెదిరింపు ఈమెయిల్ రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో అప్రమత్తమైన అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భద్రతా బలగాలు హుటాహుటిన అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కార్యాలయానికి ఈ బెదిరింపు ఈమెయిల్ అందిన వెంటనే బాంబు నిర్వీర్య దళం, డాగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. ముందు జాగ్రత్త చర్యగా కార్యాలయ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా భద్రతా చర్యలు చేపట్టారు. సుదీర్ఘంగా నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ఈ బాంబు బెదిరింపు నకిలీదేనని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయంతో ఇస్రో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కార్యాలయ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపు ఈమెయిల్ ఏ ప్రాంతం నుంచి పంపబడింది, దాని వెనుక ఎవరు ఉన్నారనే విషయాలను సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇటీవల దేశంలోని కీలక ప్రభుత్వ సంస్థలకు వరుసగా నకిలీ బాంబు బెదిరింపులు వస్తుండటంతో భద్రతా సంస్థలు మరింత అప్రమత్తమయ్యాయి. ఇలాంటి బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. కీలక సంస్థల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా, ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ, రక్షణ పరిశోధన సంస్థలకు కూడా ఇలాంటి బెదిరింపు ఈమెయిళ్లు పంపిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఆ కేసులో ఘజియాబాద్‌కు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తాజా ఘటనతో మరోసారి కీలక సంస్థల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై చర్చ మొదలైంది.

# భువనగిరి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయండి

- విజయుడు యాదవ్ టీఆర్‌పీ జిల్లా అధ్యక్షులు




**వనపర్తి,జూలై 02 (తెలంగాణ ముచ్చట్లు):** జులై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని టీఆర్‌పీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు విజయుడు యాదవ్ ఆధ్వర్యంలో, జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ నేతృత్వంలో రాజ్యాధికార సమరభేరి మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విజయుడు యాదవ్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా నుంచి కనీసం రెండు వేల మంది బీసీ ప్రజలు భువనగిరి సభకు హాజరయ్యేలా ప్రతి మండలం, గ్రామం, బస్తీలో విస్తృత ప్రచారం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు.భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో కీలక ఘట్టంగా నిలుస్తుందని, బహుజన వర్గాల రాజకీయ సాధికారతకు ఈ సభ నాంది పలుకుతుందని అన్నారు.బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువత, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో జులై 5న భువనగిరికి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి స్వామి, జిల్లా నాయకులు కురుమూర్తి ముదిరాజు, వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, కొత్తకోట మండల అధ్యక్షుడు మన్నెంకొండ, తాడిపత్రి గ్రామ అధ్యక్షుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బొల్లెపాక రమేష్ జన్మదిన వేడుకలు



**చిల్పూర్,జులై02(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకుడు బొల్లెపాక రమేష్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు నాయకులు, యువకులు కలిసి రమేష్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.రమేష్ సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అందరూ కలిసి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.
ఈ కార్యక్రమంలో చుక్క రాజేష్, బొక్కల ఆహారోన్, నల్ల జేమ్స్, గడ్డమీది మహేందర్, మొట్టం వెంకన్న, చుక్క మార్కు, చుక్క రాంబాబు, చుక్క రంజిత్, చుక్క నరేష్, చుక్క అరవింద్, చుక్క రాకేష్, ఇల్లెందుల యాకయ్య, చెరిపెల్లి జీవన్, ఇల్లెందుల పవన్, చుక్క యాదగిరి, ఇల్లెందుల అశోక్, గడ్డమీది ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామమందిర విరాళాలపై స్వతంత్ర విచారణ కోరిన కాంగ్రెస్

- ప్రధాని మోదీకి లేఖ రాసిన కేసీ వేణుగోపాల్
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్
- సీసీటీవీ దృశ్యాల ధ్వంసం, పెద్దల పాత్రపైనా విచారణ కోరుతూ ఆరోపణలు



**న్యూఢిల్లీ, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశారు. రామమందిరానికి భక్తులు సమర్పించిన వందల కోట్ల రూపాయల విరాళాల దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర సంస్థతో నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఆయన "చందా చోరీ మెగా స్కాండల్"గా అభివర్ణించారు.
ప్రధానికి రాసిన లేఖలో, శ్రీరాముడిని న్యాయానికి, ధర్మానికి ప్రతీకగా కోట్లాది మంది హిందువులు ఆరాధిస్తారని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. అలాంటి పవిత్రమైన క్షేత్రంలో భక్తుల విరాళాల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా ఆవేదన కలిగించిందన్నారు. ప్రజలు తమ కష్టార్జితాన్ని, జీవితకాల పొదుపులను విశ్వాసంతో సమర్పిస్తే వాటిని దోచుకోవడం క్షమించరాని చర్య అని వ్యాఖ్యానించారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పరిధిలో వ్యవస్థీకృతంగా పనిచేసిన ఒక ముఠా ఈ వ్యవహారంలో పాత్ర పోషించినట్లు ప్రాథమిక విచారణలో సంకేతాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కానుకల లెక్కింపు బాధ్యతల్లో ఉన్న కొందరు వ్యక్తులు సాధారణ నిఘాను తప్పించుకుని ప్రతిరోజూ పెద్ద మొత్తంలో నగదు, బంగారు, వెండి ఆభరణాలను అక్రమంగా తరలించారని పేర్కొన్నారు.
ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలను చెరిపివేసేందుకు ఏడు నుంచి ఎనిమిది నెలల కీలకమైన సీసీటీవీ దృశ్యాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఇది కేవలం కొందరు ఉద్యోగుల చర్య మాత్రమే కాదని, ఉన్నతాధికారుల సహకారంతో జరిగిన కుట్రగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. విరాళాల దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులను కూడా ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని విమర్శించారు. 202021లోనే లెక్కల్లో చూపని బంగారం, వెండి ఆభరణాల అక్రమ తరలింపుపై హెచ్చరించిన ట్రస్ట్ మాజీ ప్రధాన ఖాతాల అధికారిని విధుల నుంచి తొలగించారని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. అనంతరం జూన్ 13న ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం, జూన్ 25న నమోదైన ఎఫ్ఐఆర్ కూడా కేవలం కంటితుడుపు చర్యలుగానే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.
ఇప్పటివరకు డ్రైవర్లు, క్లర్కులు, అవుట్‌సోర్సింగ్ క్యాషియర్లు వంటి చిన్నస్థాయి సిబ్బందినే అరెస్టు చేశారని, అసలు బాధ్యులైన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోలేదని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. రాజకీయ, పరిపాలనా ప్రభావం ఉన్న వ్యక్తులపై దర్యాప్తు చేసే స్వతంత్రత ప్రస్తుత ప్రత్యేక దర్యాప్తు బృందానికి లేదని ఆరోపించారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ట్రస్ట్‌గా గుర్తుచేసిన కేసీ వేణుగోపాల్, భక్తుల విశ్వాసాన్ని కాపాడటం ప్రభుత్వ నైతిక బాధ్యత అని అన్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నతస్థాయి స్వతంత్ర సంస్థతో సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించి నిజాలను వెలికితీయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు షాక్..



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ సంగీత సంస్థ సరిగమ ఇండియా లిమిటెడ్‌తో కొనసాగుతున్న కాపీరైట్ వివాదంలో కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

1976 నుంచి విడుదలైన 134 సినిమాలకు చెందిన వివాదాస్పద పాటలను ఇళయరాజా స్వయంగా ప్రసారం చేయడం లేదా ఇతరులకు అందుబాటులో ఉంచడంపై తాత్కాలిక నిషేధం విధించింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఇళయరాజాకు తాను స్వరపరిచిన ట్యూన్లపై మాత్రమే హక్కులు ఉంటాయని, సినిమాల్లో వినిపించే పూర్తి సౌండ్ రికార్డింగ్స్‌పై హక్కులు ఉండవని స్పష్టం చేసింది.

సరిగమ ఇండియా లిమిటెడ్ వాదన ప్రకారం, 1976 నుంచి 2001 మధ్య విడుదలైన పలు చిత్రాల నిర్మాతలతో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ఆయా పాటల సౌండ్ రికార్డింగ్స్, సంగీతం, సాహిత్యానికి సంబంధించిన కాపీరైట్ హక్కులు తమకు సంక్రమించాయి.

అయితే ఆ 134 చిత్రాల పాటలను ఇళయరాజా అమెజాన్ మ్యూజిక్, ఐట్యూన్స్, జియో సావన్ వంటి డిజిటల్ వేదికల్లో అప్‌లోడ్ చేసి, వాటిపై యాజమాన్య హక్కులు తనవేనని ప్రకటించారని సరిగమ సంస్థ కోర్టుకు తెలిపింది. ఈ వాదనలను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు, పూర్తి సౌండ్ రికార్డింగ్స్‌పై హక్కులు నిర్మాతలు లేదా వాటిని చట్టబద్ధంగా కొనుగోలు చేసిన సంస్థకే ఉంటాయని పేర్కొంటూ, తదుపరి విచారణ వరకు ఇళయరాజా ఆ పాటలను ప్రసారం చేయకుండా తాత్కాలికంగా ఆదేశాలు జారీ చేసింది.

# దుల్కర్ సల్మాన్‌ను విచారించిన కస్టమ్స్..



లగ్జరీ ఎస్‌యూవీ కార్ల అక్రమ రవాణా కేసులో సినీ నటుడు దుల్కర్ సల్మాన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించారు. 'ఆపరేషన్ నుమ్‌ఖోర్'లో భాగంగా కొచ్చిలోని కస్టమ్స్ కార్యాలయానికి హాజరైన ఆయనను అధికారులు సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు.

దర్యాప్తులో భాగంగా దుల్కర్ సల్మాన్‌కు చెందిన నాలుగు లగ్జరీ వాహనాలను అధికారులు గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండింటిని ఆయన తాత్కాలికంగా విడిపించుకోగా, మిగిలిన రెండు వాహనాల కోసం ఇప్పటివరకు ఎలాంటి దరఖాస్తు చేయలేదని సమాచారం. ఆయన వద్ద ఉన్న ఇతర ఖరీదైన వాహనాల వివరాలను కూడా అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది.

ఈ కేసులో దుల్కర్‌తో పాటు అక్రమ వాహనాల వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మరో నలుగురిని కూడా కస్టమ్స్ అధికారులు విచారించారు.

దర్యాప్తు వివరాల ప్రకారం భూటాన్, నేపాల్ సరిహద్దుల గుండా పాత లగ్జరీ వాహనాలను నకిలీ పత్రాల ఆధారంగా భారత్‌లోకి అక్రమంగా తీసుకొచ్చి భారీ మొత్తంలో కస్టమ్స్ సుంకాన్ని ఎగవేసినట్లు అధికారులు గుర్తించారు.

ఈ కేసులో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా దాదాపు 60 వాహనాలను స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు, స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్న ఏడుగురిని అరెస్ట్ చేసి దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది.

# 'ది ఒడిస్సీ' కౌంట్‌డౌన్ ట్రైలర్ విడుదల..

ప్రపంచ సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న 'ది ఒడిస్సీ' చిత్రం నుంచి కౌంట్‌డౌన్ ట్రైలర్ విడుదలైంది. యూనివర్సల్ పిక్చర్స్ విడుదల చేసిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

గ్రీకు పురాణాల ఆధారంగా రూపొందుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం, ట్రోజన్ యుద్ధం అనంతరం ఇథాకా రాజు ఒడిస్సియస్ తన స్వరాజ్యానికి చేరుకునేందుకు చేసిన పదేళ్ల సుదీర్ఘ ప్రయాణం చుట్టూ సాగుతుంది. ప్రమాదాలతో నిండిన ఆ ప్రయాణాన్ని అత్యున్నత సాంకేతిక విలువలతో తెరపై ఆవిష్కరించినట్లు ట్రైలర్‌లో కనిపిస్తోంది.

చిత్రంలో ఒడిస్సియస్ పాత్రలో మాట్ డామన్ నటిస్తుండగా, పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనున్నారు. సముద్ర తుఫానులు, యుద్ధ సన్నివేశాలు, భారీ రాక్షసులు, సైరెన్స్‌తో కూడిన విజువల్స్ ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

టామ్ హాలండ్, రాబర్ట్ ప్యాటిన్సన్, జెండయా, లుపితా న్యాంగో, షార్లిజ్ థెరాన్ తదితర ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా జూలై 17న థియేటర్లలో విడుదల కానుంది.







# 'నాగబంధం' విడుదల రోజే బంపర్ ఆఫర్

పౌరాణిక అంశాలు, ఫాంటసీ, అడ్వెంచర్ కథాంశంతో తెరకెక్కిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రలు పోషించారు.

సినిమా విడుదల సందర్భంగా ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షించేందుకు చిత్రబృందం ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా అందించే 'బై వన్ గెట్ వన్' పథకాన్ని విడుదల రోజునే అమలు చేస్తున్నట్లు వెల్లడించింది.

అయితే ఈ ఆఫర్ హిందీ వెర్షన్‌కు మాత్రమే వర్తిస్తుందని, తెలుగు సహా ఇతర భాషల వెర్షన్లకు వర్తించదని మేకర్స్ స్పష్టం చేశారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందిన ఈ చిత్రంలో పౌరాణిక కథాంశానికి ఆధునిక విజువల్ ఎఫెక్టస్‌ను జోడించినట్లు చిత్రబృందం తెలిపింది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.

ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్ష నగర్కర్, రిషభ్ సాహ్నీ కీలక పాత్రల్లో నటించారు. విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకున్న ఈ చిత్రానికి హిందీ మార్కెట్‌లో ప్రకటించిన ప్రత్యేక ఆఫర్ ఎంత మేర ప్రయోజనం చేకూరుస్తుందో చూడాల్సి ఉంది.




# ధ్రువ్ విక్రమ్‌తో మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం ప్రారంభం

మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ తమిళ చిత్రసీమలో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. కోలీవుడ్ స్టార్ నటుడు విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా రూపొందనున్న కొత్త చిత్రాన్ని ఘనంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ చిత్రాన్ని మైత్రీ తమిళ్-04, డీవీ-4 వర్కింగ్ టైటిల్స్‌తో తెరకెక్కిస్తున్నారు. చెన్నైలో నిర్వహించిన పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే భిన్నమైన కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రం పూర్తి స్థాయి కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది.

ఈ చిత్రానికి కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, శబీతో కలిసి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. సినిమాలో కీలక పాత్రల్లో పృథ్వీరాజ్, సాయి దీనా నటించనున్నారు. చిత్రానికి విక్కీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలను ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ వి.ఎమ్. మోర్ రూపొందించనున్నారు. పూజా కార్యక్రమాలతో పాటు రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా వేగంగా కొనసాగుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. హీరోయిన్, పూర్తి తారాగణం, సినిమా టైటిల్‌ను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం.

# వర్షంలో తడుస్తూ సందడి చేసిన తమన్నా..



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలను ఆస్వాదిస్తూ ఇంటి బాల్కనీలో గడిపిన అందమైన క్షణాలను వీడియో రూపంలో పంచుకోగా, అది నెట్టింట వైరల్‌గా మారింది.

వర్షపు చినుకుల్లో తడుస్తూ చిన్నపిల్లలా సందడి చేసిన తమన్నా, చల్లని గాలిని ఆస్వాదిస్తూ చిరునవ్వుతో కనిపించారు. వర్షంలో పూర్తిగా తడిసిపోయినా ఆ ఆనందాన్ని సహజంగా ఆస్వాదించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ప్రకృతితో మమేకమైన ఆ క్షణాలను ఆమె కెమెరాలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

ఈ వీడియోకు ఇప్పటికే లక్షలాది వ్యూస్ రావడంతో పాటు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. "రెయిన్ క్వీన్", "వర్షంలో తమన్నా మరింత అందంగా కనిపిస్తున్నారు", "సహజమైన క్షణాలు ఎంతో బాగున్నాయి" అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో వరుస చిత్రాలు, ఓటీటీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా ప్రత్యేక పాత్రలు, డ్యాన్స్ నంబర్లతోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. షూటింగ్‌ల మధ్య దొరికే విరామ సమయంలో తన ప్రయాణాలు, ఫిట్‌నెస్, ఫ్యాషన్, వ్యక్తిగత అనుభవాలకు సంబంధించిన పోస్టులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో చురుకుగా కొనసాగుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# భారత్‌పై పెట్టుబడుల ఆసక్తి

- పారిస్‌లో నిర్మలా సీతారామన్ భేటీ
- బ్యాంకింగ్ రంగంపై చర్చ

పారిస్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):



కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో బీఎన్‌పీ పరిబాస్ కార్పొరేట్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంకింగ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యాన్ జెరార్డిన్‌తో సమావేశమయ్యారు. భారత్‌లో పెట్టుబడి అవకాశాలు, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యాన్ జెరార్డిన్ మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడి నిధులు భారత్‌ను విశ్వసనీయ పెట్టుబడి గమ్యస్థానంగా చూస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల నిర్మాణంలో భారత్ సాధించిన పురోగతి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. సాంకేతికత ఆధారిత సేవల విస్తరణ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతోందని పేర్కొన్నారు.

సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భాగంగా బ్యాంకింగ్ రంగ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. బ్యాంకింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేసి ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు సంబంధించి కమిటీకి అవసరమైన సూచనలు, సలహాలను అందించాలని యాన్ జెరార్డిన్‌ను కేంద్ర మంత్రి కోరారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, అకౌంట్ అగ్రిగేటర్ వ్యవస్థలను మరింత విస్తృతంగా అమలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఇవి కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు.

భారత్‌లో పారదర్శక విధానాలు, వేగవంతమైన డిజిటల్ సేవలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సమావేశంలో చర్చించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిర్మలా సీతారామన్ వివరించారు. భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశం ద్వారా భారత్-ఫ్రాన్స్ ఆర్థిక, బ్యాంకింగ్ రంగాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుందని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర రోజురోజుకూ బలపడుతోందని, విదేశీ ఆర్థిక సంస్థలతో ఇలాంటి సమావేశాలు పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మొజ్తబా దూరం

- భద్రతా కారణాలతో గైర్హాజరయ్యే అవకాశం
- బహిరంగ కార్యక్రమాలకు దూరంగా కొత్త అధినేత
- అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశం

టెహ్రాన్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):



ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తన తండ్రి, దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకాకపోవచ్చని అంతర్జాతీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తీవ్ర భద్రతా ముప్పు ఉన్న నేపథ్యంలో ఆయన బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని భద్రతా సంస్థలు సూచించినట్లు సమాచారం. దీంతో అంత్యక్రియలకు ఆయన హాజరవుతారా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో అలీ ఖమేనీ మరణించిన అనంతరం ఆయన అంత్యక్రియలను జూలై తొలి వారంలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దేశ చరిత్రలోనే అత్యంత పెద్ద అంతిమయాత్రల్లో ఒకటిగా ఈ కార్యక్రమం నిలవనుందని, లక్షలాది మంది ప్రజలు పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అయతొల్లా హకీం ఇలాహీ మాట్లాడుతూ, మొజ్తబా ఖమేనీ ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో భద్రతా దళాలు అందుకు అనుమతించడం లేదని తెలిపారు. ఆయన భద్రతకు తీవ్రమైన ముప్పు ఉందని భావిస్తున్నందున బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మొజ్తబా ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకాకపోవచ్చన్న ప్రచారం ఇరాన్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, దౌత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ప్రజల ముందుకు ఎప్పుడు వస్తారనే అంశంపైనా ఆసక్తి నెలకొంది. అయితే దీనిపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు కీలక నగరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అంత్యక్రియల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా దళాలను భారీగా మోహరించారు. విదేశీ ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉండటంతో ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. మొజ్తబా ఖమేనీ అంత్యక్రియలకు హాజరవుతారా లేదా అన్న అంశంపై తుది నిర్ణయం భద్రతా పరిస్థితులను బట్టి తీసుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. ఈ పరిణామాలను ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తుండగా, ఇరాన్‌లోని రాజకీయ పరిస్థితులపై కూడా అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది.

# ఇంధన ధరలపై సంకేతాలు

- క్రూడ్ ధరలపై కేంద్రం నిఘా
- తగ్గింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు
- ఆయిల్ కంపెనీల నష్టాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):



దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ, ప్రస్తుతం దేశీయంగా ఇంధన ధరలను వెంటనే తగ్గించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. మరో రెండు నుంచి మూడు నెలల పాటు క్రూడాయిల్ ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే ధరలపై సమీక్ష చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

మీడియాతో మాట్లాడిన మంత్రి, ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రెండు నెలల క్రితం అధిక ధరలకు కొనుగోలు చేసిన ముడి చమురునే శుద్ధి చేస్తున్నాయని చెప్పారు. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో తాజా ధరల తగ్గుదల ప్రభావం వెంటనే దేశీయ వినియోగదారులకు కనిపించదని వివరించారు. ముడి చమురు కొనుగోలు, శుద్ధి ప్రక్రియకు సమయం పడుతుందని పేర్కొన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయని హర్దీప్ సింగ్ పురీ గుర్తు చేశారు. అయినప్పటికీ వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీని ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరలకు విక్రయించాయని తెలిపారు. ఈ కారణంగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ.74,781 కోట్ల నష్టాన్ని భరించాల్సి వచ్చిందని వెల్లడించారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, దాని ప్రభావం దేశీయ మార్కెట్‌లో కనిపించేందుకు కొంత సమయం పడుతుందని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగా చమురు కంపెనీలు రెండు నెలల ముందుగానే ముడి చమురును కొనుగోలు చేస్తాయని, ప్రస్తుతం వినియోగిస్తున్న చమురు ఏప్రిల్, మే నెలల్లో అప్పటి అధిక ధరలకు కొనుగోలు చేసిందని వివరించారు. మరో రెండు నుంచి మూడు నెలల పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తక్కువగానే కొనసాగితే అప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై సమీక్షించే అవకాశం ఉంటుందని హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. అయితే దీనిపై ఇప్పుడే ఎలాంటి హామీ ఇవ్వలేమని, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వం ఇంధన ధరలపై నిశితంగా పరిశీలన కొనసాగిస్తోందని, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, చమురు కొనుగోలు వ్యయం, ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి తెలిపారు. దీంతో రానున్న నెలల్లో అంతర్జాతీయ మార్కెట్ ధోరణులే దేశీయ ఇంధన ధరలపై ప్రభావం చూపనున్నాయి.

# ఒప్పో రెనో 16 సిరీస్ భారత్‌లో విడుదల..

న్యూఢిల్లీ, జూలై 2, 2026 – తెలంగాణ ముచ్చట్లు:

ఒప్పో భారత మార్కెట్‌లో తన సరికొత్త రెనో 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను అధికారికంగా విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఒప్పో రెనో 16, ఒప్పో రెనో 16సీ మోడళ్లు ఉన్నాయి. ఆకర్షణీయమైన అమోలెడ్ డిస్‌ప్లే, శక్తివంతమైన ప్రాసెసర్లు, 50 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా, భారీ బ్యాటరీలు, 80 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం, కృత్రిమ మేధస్సు ఆధారిత ఫీచర్లతో ఈ ఫోన్లను కంపెనీ తీసుకొచ్చింది. జూలై 9 నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఒప్పో అధికారిక స్టోర్లలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

ఒప్పో రెనో 16లో 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.61,999 కాగా, 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.67,999గా నిర్ణయించారు. రెనో 16సీ 8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.46,999, 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ ధర రూ.49,999, 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.55,999గా ఉంది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వారికి 10 శాతం తక్షణ క్యాష్‌బ్యాక్ కూడా అందిస్తోంది.

ఈ ఫోన్లు స్టారీ వైట్, సెల్లార్ పర్పుల్, ట్విలైట్ వయోలెట్ రంగుల్లో అందుబాటులోకి రానున్నాయి. రెండు ఫోన్లూ ఆండ్రాయిడ్ 16 ఆధారిత కలర్ ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. ఒప్పో రెనో 16లో 6.32 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 3,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం ఉండగా, రెనో 16సీలో 6.57 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 1,400 నిట్స్ గరిష్ఠ ప్రకాశం అందించారు.

పనితీరు పరంగా రెనో 16లో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, ఎల్‌పీడీడీఆర్5ఎక్స్ ర్యామ్, యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజ్ అందించారు. రెనో 16సీలో మీడియాటెక్ డైమెన్సిటీ 7300 చిప్‌సెట్, ఎల్‌పీడీడీఆర్4ఎక్స్ ర్యామ్, గరిష్ఠంగా 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్ లభిస్తుంది.

కెమెరా విభాగంలో రెనో 16లో ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో 50 మెగాపిక్సెల్ సోనీ ప్రధాన కెమెరా, 50 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, 50 మెగాపిక్సెల్ టెలిఫోటో కెమెరా ఉన్నాయి. రెనో 16సీలో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు 8 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరాను అందించారు. రెండు ఫోన్లలోనూ సెల్ఫీల కోసం 50 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉంది.

బ్యాటరీ విషయానికి వస్తే, రెనో 16లో 6,700 ఎంఏహెచ్ బ్యాటరీ, రెనో 16సీలో 7,000 ఎంఏహెచ్ బ్యాటరీని అమర్చారు. రెండు ఫోన్లలోనూ 80 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం ఉంది.

ఇక ఇతర ఫీచర్లలో ఇన్‌డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్, 5జీ, వైఫై, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్ సీ, జీపీఎస్‌తో పాటు ఐపీ66, ఐపీ68, ఐపీ69, ఐపీ69కే ధూళి, నీటి నిరోధక రేటింగ్‌లను కూడా కంపెనీ అందించింది.



# పీఎఫ్ విత్‌డ్రాపై కొత్త నిబంధనలు.. కనీస బ్యాలెన్స్ తప్పనిసరి

న్యూఢిల్లీ – జూలై 2, 2026 – తెలంగాణ ముచ్చట్లు:

ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నగదు ఉపసంహరణ నిబంధనలను సవరిస్తూ కొత్త ఈపీఎఫ్ పథకం-2026ను అమల్లోకి తీసుకొచ్చింది. జూన్ 29 నుంచి అమలులోకి వచ్చిన ఈ నిబంధనల ప్రకారం, పీఎఫ్ ఖాతా నుంచి పాక్షికంగా నగదు ఉపసంహరించాలంటే ఖాతాలో కనీసం 25 శాతం బ్యాలెన్స్ తప్పనిసరిగా ఉంచాలి.

కొత్త నిబంధన ప్రకారం, ఉద్యోగి మరియు యాజమాన్యం చెల్లించిన మొత్తం నిధిలో 25 శాతాన్ని పక్కన పెట్టిన తర్వాత మిగిలిన మొత్తాన్నే ఉపసంహరణకు అర్హమైన బ్యాలెన్స్‌గా పరిగణిస్తారు. ఉదాహరణకు ఖాతాలో రూ.1 లక్ష ఉంటే, రూ.25 వేలను తప్పనిసరిగా ఉంచి మిగిలిన రూ.75 వేల నుంచే నిబంధనల ప్రకారం నగదు తీసుకోవచ్చు.

పాక్షిక ఉపసంహరణకు అనుమతించే కారణాలను కూడా ప్రభుత్వం విస్తరించింది. ఇల్లు లేదా స్థలం కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణం చెల్లింపు, ఇంటి మరమ్మతులు, అనారోగ్యం, పిల్లల ఉన్నత విద్య, వివాహం వంటి అవసరాలకు అర్హత ఉన్న బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం కల్పించింది. ఉద్యోగంలో చేరిన 12 నెలల తర్వాత ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది.

ప్రత్యేక పరిస్థితుల్లో నగదు ఉపసంహరణకు అదనపు వివరణలు సమర్పించాల్సిన అవసరం లేదని కూడా ఈపీఎఫ్ఓ స్పష్టం చేసింది. సభ్యులకు సేవలను మరింత సులభతరం చేయడానికి ఈపీఎఫ్ఓ సాంకేతిక సేవలను విస్తరిస్తోంది. త్వరలో యూపీఐ ద్వారా నేరుగా పీఎఫ్ నగదును బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసే విధానాన్ని ప్రారంభించనుంది. అలాగే వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానుంది.

వెరిఫైడ్ వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపడం ద్వారా పీఎఫ్ బ్యాలెన్స్, చివరి ఐదు లావాదేవీలు, క్లెయిమ్ స్థితి వంటి వివరాలను ప్రాంతీయ భాషల్లోనే తెలుసుకునే సౌకర్యం కల్పించేందుకు ఈపీఎఫ్ఓ ఏర్పాట్లు చేస్తోంది.






# చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు.. వారం రోజుల్లోనే భారీ పెరుగుదల

హైదరాబాద్ – జూలై 2, 2026 – తెలంగాణ ముచ్చట్లు:

తెలుగు రాష్ట్రాల్లో చికెన్, కోడిగుడ్ల ధరలు గత వారం రోజులుగా భారీగా పెరుగుతున్నాయి. ధరల పెరుగుదలతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులపై అదనపు భారం పడుతోంది. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.280 నుంచి రూ.300 మధ్య ఉండగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు విక్రయిస్తున్నారు. విజయవాడలో కూడా కిలో చికెన్ ధర రూ.320 నుంచి రూ.330 వరకు చేరింది. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.

చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం ఒక్క గుడ్డు రూ.6 నుంచి రూ.7 మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే ధర దాదాపు రూ.240కు చేరుకుంది. ధరల పెరుగుదలకు పలు కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడంతో ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. అలాగే మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా అధికమైందని పేర్కొన్నారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో పలువురు రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు సమాచారం. సరఫరా తగ్గడం, డిమాండ్ కొనసాగడం వల్ల చికెన్, కోడిగుడ్ల ధరలు ప్రస్తుతం పెరిగిన స్థాయిలోనే కొనసాగుతున్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

శుక్రవారం - 03- జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# సికింద్రాబాద్‌లో గోల్డెన్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

- సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి మరో అడుగు
- వసతి సౌకర్యాలను వర్చువల్‌గా ప్రారంభించిన దక్షిణ భారత్ ఏరియా జీఓసీ

**సికింద్రాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన 'గోల్డెన్ పామ్ కాంప్లెక్స్'ను దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా ప్రధాన కార్యాలయ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌తో పాటు సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్‌కు చెందిన సేవలో ఉన్న సైనికులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ నగరంలోని ప్రధాన ప్రాంతంలో, జూబ్లీ బస్ స్టేషన్, రెండు మెట్రో స్టేషన్లకు సమీపంలో ఈ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సైనికులు, వారి కుటుంబ సభ్యులకు రాకపోకలు మరింత సులభంగా ఉండనున్నాయి.

ఈ కాంప్లెక్స్‌లో త్రివిధ దళాలు, భారత తీర రక్షక దళానికి చెందిన సేవలో ఉన్న సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక బస కోసం అందుబాటు ధరల్లో ఆధునిక వసతి సౌకర్యాలు కల్పించారు. ఒకరికి, ఇద్దరికి అనువైన గదులను ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. దక్షిణ భారత్ ఏరియా ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇప్పటికే ఇలాంటి గోల్డెన్ పామ్ వసతి సముదాయాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో చెన్నైలోని గోల్డెన్ పామ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు.

సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి భారత సైన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఇటువంటి వసతి కేంద్రాల ఏర్పాటు ద్వారా సైనిక కుటుంబాలకు మరింత భద్రత, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గోల్డెన్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభంతో సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వసతి సౌకర్యాలు మరింత అందుబాటులోకి వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. సైన్యం తన విస్తృత కుటుంబం పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ కేంద్రం మరో నిదర్శనంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# పత్తి విత్తనాల పంపిణీ ప్రారంభం

- పత్తి ఉత్పాదకత మిషన్‌కు శ్రీకారం
- 19 జిల్లాల్లో పథకం అమలు
- ఆధునిక సాగుపై రైతులకు అవగాహన

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం, ఉత్పాదకత పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రాయోజిత పత్తి ఉత్పాదకత మిషన్‌ను 2026 ఖరీఫ్ సీజన్ నుంచి 19 జిల్లాల్లో అమలు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఈ పథకం ప్రారంభంలో భాగంగా గురువారం వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయంలో రైతులకు పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి రైతులకు విత్తనాలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి. గోపి మాట్లాడుతూ 2026 వానాకాలం నుంచి 203031 వరకు అమలు కానున్న ఈ మిషన్ ద్వారా ఆధునిక సాగు విధానాలను రైతులకు విస్తృతంగా పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అధిక




సాంద్రతతో పత్తి సాగు, క్లస్టర్ సాగు, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులను ప్రదర్శన క్షేత్రాల ద్వారా రైతులకు చూపించి వాటి ప్రయోజనాలను వివరించనున్నట్లు చెప్పారు. ప్రదర్శన క్షేత్రాల్లో పాల్గొనే రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు, మొక్కల ఎదుగుదలకు అవసరమైన ఉత్పత్తులు, వేప ఆధారిత పురుగు నివారణ మందులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్లను రాయితీపై అందించనున్నట్లు అధికారులు తెలిపారు. శాస్త్రీయ సాగు విధానాలను రైతులకు చేరువ చేయడం ద్వారా దిగుబడులు పెంచడమే ఈ మిషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ రైతులకు ఆధునిక పత్తి సాగు పద్ధతులు, మొక్కల సాంద్రత నిర్వహణ, సమగ్ర పోషక యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు.

నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి సాధించిన ఫలితాలను సభలో వివరించారు. తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకుంటూ ఆధునిక సాగు విధానాలు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు. రైతులు కొత్త సాంకేతికతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు రైతులు పత్తి ఉత్పాదకత మిషన్‌ను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. కలుపు మందుల వినియోగాన్ని తగ్గిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడులతో ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## జులై 20లోపు నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలు

**న్యూఢిల్లీ, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ యూజీ రీఎగ్జామ్ ఫలితాలను జులై 20లోపు విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఎన్‌టీఏ సీనియర్ అధికారులు తెలిపారు. అయితే ఫలితాల విడుదలకు సంబంధించి ఖచ్చితమైన తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. రీఎగ్జామ్ అనంతరం జూన్ 25న ఎన్‌టీఏ ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను జూన్ 28 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి అభ్యంతరాన్ని నిపుణుల కమిటీ విడివిడిగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుందని తెలిపారు.



# అడకత్తెరలో అన్నదాత..!!

ప్రభుత్వం రైతుబంధు....
ఎకరానికి 10000 ఇస్తుంది.
విత్తనానికి సాయం చేస్తుంది
కానీ.... !!...??
ఆ డబ్బు బ్యాంకులో పడేలోపే
అప్పులవాడు
ఇంటి ముందు నిలబడతాడు.
ఎరువుల షాపు వాడు
లెక్క రాస్తాడు.
రైతుబంధు
అప్పుల బంధం అవుతుంది.

వరుడు వర్షం వర్షించడు
మబ్బులు కమ్ముతాయి.
ఉరుములు ఉరుముతాయి
ఊరిస్తాయి.. ఊరడిస్తాయి.
కానీ.....
కురవవు...ఒక్క చినుకు రాల్చవు.
భూమిలోనే..
విత్తనం మాడిపోతుంది.
ఆశ నెర్రెలు బారిన నేలలా
బీటలు వారుతుంది.
వరుణుడు బంధు కాదు
శత్రువు అవుతున్నాడు.

ప్రకృతిని నమ్ముకున్న రైతు
ఆకాశం వైపు చూస్తాడు.
భూమిని నమ్ముతాడు.
చెమట చిందించి
నెత్తురు ధారపోసి
పంట పండిస్తాడు
దేశానికి అన్నం పెడతాడు.





రైతు పరిస్థితి అడ కత్తెరలో........!!
ఒకవైపు ప్రభుత్వం
ఇచ్చే సాయం చాలదు.
మరొకవైపు వరుణుడు
కరుణ చూపడు.
ఇంకో వైపు దళారులు దోచుకుంటారు.
అప్పులు మెడకు ఉరి అవుతాయి.

**రైతు అడకత్తెరలో పోక చెక్క!**

నలిగిపోతున్నాడు.
నుజ్జు నుజ్జు అవుతున్నాడు.
కన్నీళ్లు కారుస్తూ...
కడుపు మార్చుకుంటూ..
ఉరితాడు వైపు చూస్తున్నాడు.

ఓ ప్రభుత్వమా...!!
రైతుబంధు చాలు..
రైతు భరోసా ఇవ్వు !!
డబ్బు ఇవ్వడం కాదు...?
గిట్టుబాటు ధర ఇవ్వు !!
రుణమాఫీ కాదు...?
పంటకు బీమా ఇవ్వు !!
అన్నదాత ఆత్మహత్య చేసుకోకుండా
చూడు..!!

ఓ వరుణ దేవా..!!
ఒక్కసారి కురిసి చూడు
భూమాతా
పులకించిపోతుంది.
రైతన్న మోహంలో
చిరునవ్వు చూడు
దేశం సుభిక్షంగా ఉంటుంది.

**ఓ సమాజమా కళ్ళు తెరువు**

నువ్వు తినే ప్రతి మెతుకు వెనుక..
ఒక రైతు బతుకు ఉంటుంది
రైతన్నను గౌరవించు !!
వాడి కష్టాన్ని గుర్తించు..!!
వాడి కన్నీరు తుడువు..!!

ఓ రైతన్న అధైర్య పడకు...!
నీవు ఒంటరి వాడివి కాదు!!
నీ చెమట భూమాతకు తెలుసు..!!
భూమాత నీకు తోడు..!!
నీ కష్టం భూమాతకు తెలుసు..
ఆత్మహత్య పరిష్కారం కాదు
.... పోరాడు..!!*

రైతుబంధు కాగితం మీద...
వర్షం బంధు ఆకాశం మీద ...
రైతు బతుకు మాత్రం.....
ఉరితాడు మీద......
అడకత్తెరను విరిచేయాలి !
ధర్మపు కొడవలి పట్టాలి.!
అన్నదాతను కాపాడాలి !!
అదే నిజమైన లోక కళ్యాణం !!



కావ్యసుధ
వాఙ్మయ భూషణ
భాగ్యనగరం

# ఆ లాంతరూ లేదు..!



చీకటి అలుముకున్న
మనసు ఇంటి తలుపుల్ని
ఎవరో దబదబా కొట్టారు.
తెరచి చూశాను...
పిడుగులా
ఓ మనిషి వచ్చిపడ్డాడు
వెలుగేమో అనుకున్నా..

అలికిన.. ఆ పచ్చి
మట్టి నేల మీద
బరువైన అతని
గన్ బూట్స్ ముద్రలు
పడ్డాయి.

గమనించనే లేదు నేను.

అంతకుమునుపు
ఆ ఇంటి ముందు
కనీసం
ఓ చిన్న లాంతారు
వెళ్ళాడుతుండేది.
ఇప్పుడా
వీధంతా చీకటై
పోయింది.!!

—దియా_విఘ్నేష్

# పోలీసు ఉద్యోగాలపై ఆందోళన

- ఉద్యోగ అభ్యర్థులతో కేటీఆర్ భేటీ
- 20 వేల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూలై 2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ వందలాది మంది పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. రాష్ట్రంలో ఉన్న పోలీసు ఉద్యోగాల ఖాళీలు, నోటిఫికేషన్‌పై తమ ఆందోళనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగ ఖాళీలు ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 5 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వాలని భావించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా కోచింగ్ తీసుకుంటూ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న తమకు ప్రభుత్వం తీవ్ర నిరాశ కలిగించిందని వాపోయారు.

అశోక్‌నగర్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని అభ్యర్థులు ఆరోపించారు. నిరసనలను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని పేర్కొంటూ, దిల్‌సుఖ్‌నగర్‌కు వచ్చి తమ పరిస్థితిని పరిశీలించాలని కేటీఆర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కేటీఆర్, రెండున్నరేళ్లుగా నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నామని చెప్పారు. త్వరలోనే దిల్‌సుఖ్‌నగర్‌కు వచ్చి నిరుద్యోగులను కలుస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ చేపట్టామని కేటీఆర్ పేర్కొన్నారు. స్థానిక యువతకు 95 శాతం రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. గతంలో భర్తీ చేసిన ఉద్యోగాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 20 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in